# కళాత్మ

— చిత్ర

ప్రతి పది సెకండ్లకోసారి నా చేతిలో ఉన్న టీకప్పు నా పెదాలకు అందుతూనే ఉంది.... అప్రయత్నంగా అవి చప్పరిస్తూనే ఉన్నాయి!

కాన్వాస్ మీద నా చూపులు రంగులతో కలబడుతూనే ఉన్నాయి. మనసు ఒక రసమయి జగత్తులో తేలిపోతున్న మధుర క్షణాలు ఒక్కసారిగా చెల్లాచెదురై పోయాయి. చూసుకోని నా చేయి అజాగ్రత్త పెదాలకు ఖాళీ కప్పు అందించడమే ఇందుక్కారణం....! వెనుకకు తిరిగి చూశాను....శారద నేలమీద వాలుగా కూర్చుని తల మంచం మీదకు వాల్చి నిద్రలోకి జారినట్టు కనిపిస్తుంది. ఇలా ఎన్నో రాత్రులు నాతో నిద్రకాచి టీలందిస్తూ... టీ తాగినంత సేపట్లోనే నిద్రలోకి జారుతూ....పిలిచిన వెంటనే లేచిరాగల ఓపికా....., ఓర్పు నా దగ్గరే నేర్చింది. ఆ పక్కనే అప్పుడెప్పుడో నిద్రపోయిన పిల్లలు పడుకున్న తీరుచూస్తే ఆ మంచానికి తలవైపు ఎటో నిశ్శబ్దంగా ఉన్న ఈ చిన్న గదిలో గోడకు కట్టేసిన గడియారం ఒకటే గొడవ చేస్తున్నట్టు అనిపించి నా చూపులు గోడమీదికి మళ్ళాయి. గడియారం కాలాన్ని బంధించి తనచుట్టూ తిప్పుకుంటున్నట్టు అనిపించింది. చిన్నముల్లు ఇంకాసేపట్లో రెండును చేరుకోబోయింది. పెద్దది ఎనిమిదిని దాటి వస్తుంది. ఈ రెండిటికీ లోపల ఇంకేదో తాళం కొడుతూ ఉంది.




దేవత ముందు భక్తునిలా ఉదయం నుండీ ఇక్కడే కూర్చోవడం మూలాన అప్పుడప్పుడు నా చేయి బ్రెష్‌నొదిలి నడుము నొప్పుల్ని పడుతుంది. కాన్వాస్ మీద రూపుదిద్దుకుంటున్న ఆ సుందరి మా శారదలాగే కొన్నిసార్లు విసిగిస్తూ.....కొన్ని సార్లు ఆనందపరుస్తూ ఉంది. కావాల్సినప్పుడల్లా పిండుకునే రంగురంగుల ట్యూబులు, తాగి పెట్టిన టీ కప్పులు వాటి మధ్యనెక్కడో అగర్‌బత్తీలాగా సిగిరెట్ పొగ ఇల్లంతా పాకుతుంది. ఇవన్నీ చాపనిండా పరుచుకున్నాయి. నా చేతిలోని కుంచె యుద్ధం చేస్తున్నప్పటికీ... నా కనురెప్పల మీద మత్తు నాట్యం చేయడం మొదలెట్టింది.

నీళ్ల వచ్చే వేళయింది. స్కూటర్ బయట పెట్టమని ఒకటే గొడవ చేస్తున్న శారదగొంతు నన్ను నిద్ర నుండి లేపిందాకా వదల్లేదు. ఉదయాన్నే లేచి స్కూటర్ గేటు అవతల పెడితేనేగాని కొళాయి కింద నీళ్ల పట్టుకోవడానికి వీలవ్వని పరిస్థితి. ఈ సిటీలైఫ్‌లో ప్రతిదీ ఇరుకేనని...., వచ్చిన పని ముగిసాక వెళ్ళిపోయే ముందు అతిథులనే మాటలు ఇక్కడుండే పక్క పోర్షన్ వాళ్ళావిడ, మా శారద నీళ్ళొచ్చే సమయానికి ముందే నాలుగ్గంటలకు నిద్రలేచి చడీ చప్పుడు కాకుండా నీళ్ల పట్టుకోవడం మొదలెడుతారు.

పై పోర్షన్‌లో మా ఇంటి యజమానురాలికి మెలుకువ వచ్చి మోటర్, దాంతో పెద్ద పైపు తీసుకొని ఒకొక్క మెట్టు దిగి వస్తుంటే.... అల్లరి చేస్తున్న క్లాసులోకి బెత్తం తీసుకొని వస్తున్న పంతులమ్మలాగా వీళ్ళకు అనిపించకపోదు. వాళ్ళ రెండో బిందె నిండాక తరువాత వంతు మనదే వెళ్ళు వెళ్ళమని తరుముతున్నట్టే చెబుతుంది మా ఆవిడ. చివరి నిముషం దాకా నన్నూ, పిల్లల్ని చీదరించుకొని స్కూలుకు వెళ్ళే క్షణాలముందు తెచ్చుకున్న నవ్వుతో టా....టా.....చెప్పే శారదను చూస్తుంటే తన దినచర్య సబ్జెక్టులో 'హార్డు పిరియడ్' ఒకటి ముగిసినట్టు అనిపిస్తుంది.

పిల్లల్ని స్కూల్లో దిగబెట్టి తిరిగొచ్చే లోపల కొళాయి చుట్టూ ఉన్న బిందెలన్నీ మాయమై పోయాయి. ఇవాళ స్నానం చెయ్యాలో.....వద్దో...! చేస్తే ఎన్ని నీళ్ళతో చెయ్యాలో. తొట్టిలో నీళ్ళను చూస్తేగాని నిర్ణయానికి రాలేను. అరబకెట్ నీళ్ళతో స్నానం ముగించాను. రేడియోలో జనరంజని అప్పుడే అయిపోయింది. ఇంకో అరగంటలో ఇంటిని రాత్రి సీను లాగే నా చుట్టూ పేర్చాను.

*　　*　　*

శారద గొంతుకు కోపం రాకముందే తప్పదన్నట్టుగా భోజనానికి లేచాను. మా ఇంట్లో డైనింగ్ హాలు, డ్రాయింగ్ హాలు, బెడ్రూము, కిచెన్‌రూము, వీటన్నిటికి కలిపి ఒకే ఒక్క సింగిల్‌రూం. మామూలుగా డ్రాయింగ్ రూంలో ఇటు తిరిగి భోజనం చేయడమే డైనింగ్ హాలు, అవన్నీ జాగ్రత్తగా పక్కకు సర్దుకుని చాప మీద దుప్పటి పరుచుకుంటే బెడ్రూము, ఆ మూలనున్నది కిచెన్‌రూం.

అవసరాన్ని బట్టి మనసు మార్చుకునే కొందరి మనుషుల్లాగే మా ఇల్లూన

మా ఇంట్లో చోటు చేసుకున్న కొన్ని వస్తువులు భలే విచిత్రంగా కనిపిస్తుంటాయి. ఆపై సెల్ఫ్‌లో ఉన్న దేవుళ్ల పూజలు, పునస్కారాలు నోచుకోకపోయి నా మమ్మల్ని దీవిస్తున్నట్టుగా హస్తం చూపుతూ ఉండడం చూస్తుంటే...... చాలా ఇళ్ళలో కొడుకూ కోడళ్ళ ఆదరణకు నోచుకోని ముసలి తల్లిదండ్రుల్లాగే నాకనిపిస్తుంది.

వాటినలా ఉంచడానికి కారణం లేకపోలేదు. ఇక క్రింది సెల్ఫ్‌లో అద్దం, కొబ్బరినూనె, దారపురాళ్ళు, పిల్లల టై, బెల్టులు, వగైరా నానా సరంజామ మధ్య నన్ను చూడండని తొంగిచూసే వస్తువు కావాలన్నా రెండడుగులు వేస్తే మహా ఎక్కువ. గాలీ, వెలుతురు రావడానిక్కూడా ఇరుకైన ఈ చిన్ని ఇంట్లో పెరిగిన ఈ కళారూపాలకు ప్రజాదరణకేం కొదువ లేదు. ప్రపంచం ఇంత విశాలమై టికీ నాకు గుర్తెరిగిన నాటి నుం 'ఇరుకు' లోనే పెరిగాను. మా చిన్నారులకు బొమ్మలు వేయడంలో నా ప్రోత్సాహం పెద్దగా లేనప్పటికీ వాళ్ళలో పుట్టుకొస్తున్న ఉత్సాహం, పట్టుదల వాళ్ళు వేసే బొమ్మలకు జీవం అవుతున్నాయి. ఆ చిన్న హృదయాలు కూడా స్పందిస్తాయా అన్న ఆశ్చర్యం కలుగుతుంది. ఆ క్షణాలలో వాళ్ళు పొందే ఆనందం.....! నాకు చిన్నప్పటి అనుభవం. ఈ అనందపు లోకం వీడి మామూలు యాంత్రిక జీవితంలోకి వస్తే బిక్కమొఖం వేయాల్సిందే....! అందుకే కాబోలు ఆ వయసులో నేను బొమ్మలు వేస్తుంటే మా నాన్నకు ఇష్టముండేది కాదు. ఆ మాటవెనుక ఎంతటి చేదు అనుభవం ఉందో ఇప్పటికి గాని అర్థం కాలేదు.

చదువూ, సంధ్య పెద్దగా లేనప్పటికీ పెట్టుబడితో వ్యాపారం చేయిలేనప్పటికీ వంశసారాంశంగా వస్తున్న ఈ కళనే నన్నిక్కడిదాకా ఈడ్చుకొచ్చింది. "తీసుకోండి " అన్న పిలుపుతో ఆలోచనలకు తెరపడింది. ఏవేవో ఆలోచనలు ఒకదాని తరువాత ఒకటి పుట్టుకొస్తూ పొందు గడుపతున్నట్టు అనిపించింది. శరీరంలోని భాగాల్ని ఒకసారిగా అప్రమత్తమై మనసును పట్టుకొచ్చాయి.....!

లేచి గడప అవతలకి నడిచాను, ఒల్లంతా రంగులతో తడిసిన ఆ సుందరిని చూస్తుంటే... మనసు లేకుండా చేసిన పనిలో ఎన్ని లోపాలుంటాయోతెలిసి సరిదిద్దుకోవడానికి ప్రయత్నిస్తూ.....కళ్ళ అందం గురించి ఊహించినంతసేపట్లోనే మనసు ఝాన్సీని చేరింది. ఝాన్సీ నాకు స్నేహితురాలు చక్కటి ఎనాటమి కలిగిన అందమైనది తన రూపం. కూర్చునే తీరు, నిలుచున్న ఒంపు, వీటన్నిటినీ మించి ఆ నడకలో దాగిన అపురూప సౌందర్యం, ఆమె మాటల్లో కూడా తొంగి చూసే మాధుర్యం.. అందానికి తగ్గట్టు హుందాతనం, వీ[illegible]టినా కాపాడుకునే సంస్కారం ఝాన్సీలో కనిపిస్తాయి. గర్ల్ ఫ్రెండ్స్‌లో కాస్త చనువున్నది ఝాన్సీతోనే కాబట్టి మరింత అందంగా ఉందనే రెండేళ్ళ క్రితమే తనతో నాకు మొదటి పరిచయం." బి.ఇడి. ట్రైనింగ్ కోసం చార్ట్స్ పై ఈ బొమ్మలు వేసిస్తారండీ?.'అని అడిగిన ఆ నలుగురిలో ఝాన్సీ ఒకరు. వాళ్ళు చెప్పిన బొమ్మలన్నిటికీ నేను చెప్పిన డబ్బులు వాళ్ళ గుండెల దిరేలా చేశాయి. నలుగురిలో ఒక అమ్మాయి "ఇంతైతే ఇచ్చుకోగలమండీ " అంటున్న ప్రాధేయపు మాట తీరు నన్ను స్పందింపచేశాయి. ఆ బొమ్మలు వేస్తున్నంతసేపూ వాళ్ళు చర్చించుకుంటున్న మాటలను గమనిస్తూనే ఉన్నాను. ఆ నలుగురిలో అందమైన అమ్మాయి చూపులు నా చేతిలో కదిలే కుంచెను గమనించడం చూస్తే! చిత్రకళ పట్ల తనకున్న ఆసక్తిని తెలుపుతుంది. ఆ పరిచయమే స్నేహంగా మారింది.

తను దగ్గరగా కూర్చుని కబుర్లు చెప్పుతున్నప్పుడు వింటున్నట్టే ఉంటానుకాని!? తన గురించి మనసులో పలు రకాల ఆలోచనలు నన్ను మూడీగా చేస్తున్నాయి. తను మధ్య మధ్యలో వేసే ప్రశ్నలకు సరిగా జవాబు చెప్పలేకపోతే ఎక్కడ పట్టుబడుతానో అన్న భయంతో మనసు అదుపులో పెట్టడానికి కూడా ప్రయత్నం చేస్తున్నాను. తన గురించి నా మనసులో ఫెయిర్ ఒపీనియన్ ఉన్నట్టు కరెక్టుగా నటిస్తున్నానో లేదో తెలియదుగాని... ముఖం చాటేసుకోవడానికే ఎక్కువ ప్రయత్నం చేస్తున్నాను.



అందమైన అమ్మాయిని న్యూడ్‌గా ఆర్టిస్టిక్‌గా మోడలింగ్ చేసి రకరకాల యాంగిల్స్‌లో చిన్నచిన్న ఒంపు సొంపుల్లో దాగి ఉన్న అందాల్ని దిద్దాలని ఉంది. మనసులోని చిరకాలపు కోరిక కోరికగానే మిగిలిపోయింది. ఝాన్సీతో మాట్లాడుతున్న ప్రతిసారీ ఆ కోరిక నరాలలో పాకి ఏదోలా తయారౌతున్నాను.

సృష్టిలో పుట్టిన ప్రకృతి అందాల్ని ఆస్వాదించాలని ఆరాటపడే నిరంతర తపనే కళాకారుడికి ప్రాణమని తెలుసు. దాచటం కూడా చాతకాని కోరికను ఝాన్సీతో చెప్పాలని చాలాసార్లు అనుకున్నాను కాని, మనసెందుకో అంగీకరించలేదు. ఒకవేళ నోరుజారి అడిగి ఉంటే నా మీద తనకున్న గౌరవం ఏమయ్యేది!?

అదే పనిగా రోడ్ల వెంట తిరిగే జులాయి వెదవల్లా, నన్నూ భావించి ఉంటే నేనేం కావాలి?! పోనీ అంతటి అవమానం జీర్ణించుకుని తలెత్తి తిరగ్గలనా అన్న సందేహం కూడా కలుగుతుంది. అంతటి క్లిష్టమైన కోరిక తీరాలంటే డబ్బు కోసం చేసే వేశ్య అయినా కావాలి! లేదా..... కళా హృదయమైనా ఉండి ఉండాలి. ఈ రెండిటిలో తను ఏదో ఒకటి అయ్యుంటే నేననుకున్నది తీరేది. మరి ఝాన్సీది డబ్బుకోసం లొంగే మనస్తత్వం అనుకుందామా అసలే కాదు. ఒకవేళ అందుకు ఒప్పుకున్నా నేను కొనలేను.... నేను చెప్పేది విని నన్నర్థం చేసుకోవడానికి విశాల హృదయమే కావాలి. మరి అంతటి విశాల హృదయం తనకుందో లేదో కనీసం అంచనా కూడా వేయలేని పరిస్థితి నాది.

అంతర్గత భావాల్ని ఒకరికొకరు చెప్పుకునే ఔన్నత్యానికి ఎదగని స్నేహం మాది. పోనీ అంత విశాల హృదయమే ఉండి మోడలింగ్‌కు ఒప్పుకుని ఉంటే.......

పట్టలేని ఆనందంతో ఆకాశంలోకి విసిరిన శాంతి దూతలా పురి విప్పిన ఆ అందాల శిఖరాలపై నా మనసు వాలిపోవలసిందే! ఆ గుండెల్ని చీల్చుకుని కెరటాల్లా ఎగిసిపడుతున్న ఆ వక్షోజాలు, విరభూసిన అందాల్ని దాచటానికి ప్రయత్నిస్తున్న ఆ కురులు, నాజూకైన ఆ నడుముకు నాభి తెచ్చిన అందం. ఆ కళ్ళ చుట్టూ చేరుతున్న మైకం, ఆ రంగుల ప్రపంచంలో ఏది ముందు, ఏది తరువాత చూడాలో సతమత పడుతున్న పరిస్థితిలో నాలో ఉద్భవించిన యవ్వన శక్తి నా ఏకాగ్రత మీదికి ఎగపాకుతుంది.

ఏదో తెలియని వాంఛ ఆమెవైపు నెడుతున్నట్టు అనిపిస్తుంది. జారిపోతున్న చూపులు, కరిగిపోతున్న మనసు, ఎదలో లయతప్పుతున్న చప్పుడు, ఇంతలో ఎవరో గెంటేసినట్టుగా ఊహల నుండి బయటపడ్డాను.

*                *                *

అబ్బ....! ఒల్లంతా చమటై పోయింది.వేళ్ల మధ్యనున్న కుంచె కాన్వాస్ మీద ఇంకా ఆ సుందరి తలరాతను పిచ్చిగా రాస్తూనే ఉంది. మనసులాగే పాడైపోయిన పెయింటింగ్ మీద కోపమొచ్చింది. క్షణాలలో రంగుల్ని తీసుకొని కాన్వాస్ మీద ఇష్టమొచ్చినట్టు విసిరికొట్టి మూడ్ బాగోలేదని వదిలి వెళ్ళిపోయా... మనసు నిలిపి చేయని ఏ పనైనా గుర్తింపుకు నోచుకోదని తెలుసు. అయినా అప్పుడప్పుడు జరిగే పొరపాట్లను లెక్కపెట్టక మళ్ళీ ప్రయత్నించడం అలవాటు చేసుకునే వాణ్ణి....!

నేను వేసిన ప్రతి బొమ్మ నన్ను పూర్తిగా తృప్తిపరచలేక పోయినా ఒక్కొక్కటి ఒక్కొక్క స్థాయిలో ఆగిపోయినవే. ఈ ఏడాది జాతీయ స్థాయి పోటీలకు మంచి పెయింటింగ్ వేయాలనుకుంటూనే అశ్రద్ధ చేసి ఆఖరి తేది కూడా ఇవాల్టితో ముగిసిందని తెలిసి నన్ను నేనే అసహ్యించుకున్నాను. ఆ తరువాత పది పదిహేను రోజులకే అనుకుంటా...... ఇంట్లోకి అడుగుపెడుతున్న నన్ను చూసి!... శారద పట్టలేని ఆనందంతో నాకు జాతీయ స్థాయిలో గోల్డ్‌మెడల్ వచ్చిందంటూ టెలిగ్రాం చేతికందించింది.

ఆ రోజు ఊహాసుందరి మీద కోపంతో విసిరిన రంగుమరకల్ని 'కళాత్మ' అని టైటిల్ పెట్టి మీ పేరుతో పోటీకి పంపింది నేనేనండీ.... అంటూ.....

**శారద నవ్వింది.**